

17న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగే సమావేశంలో జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షిస్తారని పేర్కొన్నారు.

'చింతలపూడి'ని పూర్తి చేయండి

- ఎర్రకాల్వ మిగులు భూములు పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్
- అసైన్డ్ భూములకు పట్టాలిస్తే పెద్దలకే ప్రయోజనం
- ప్రతి పేదవానికీ రెండెకరాల భూమి పంపిణీ ఎందుకు చేయరు
- మంత్రులుగా పని చేసినా చింతలపూడి
- బస్సు డిపో లేకపోవడం దారుణం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ప్రజారక్షణభేరి బస్సు యాత్రకు అడుగడుగునా జన నీరాజనం


ఏలూరులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


వి.ఉమామహేశ్వరరావు


వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం/టి.నర్సాపురం/చింతలపూడి/ఏలూరు అర్బన్

మెట్టప్రాంతంలో లక్షల ఎకరాలకు సాగు నీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పక్కన పెట్టడం దారుణమని, తన తండ్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ప్రాజెక్టును జగన్ వెంటనే పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చింతలపూడి, పట్టిసీమ పోలవరం ప్రాజెక్టులో భాగమని చెబుతున్నారని, పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో ఇరిగేషన్ మంత్రి చెప్పలేకపోతున్నారన్నారు. సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర మంగళవారం జిల్లాలో రెండో రోజు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఉదయం కొయ్యలగూడెంలో ప్రారంభమైన యాత్ర జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, చింతలపూడి, లింగపాలెం, విజయరాయి మీదుగా జిల్లా కేంద్రం ఏలూరు చేరుకుంది. ప్రతిచోటా యాత్ర బృందానికి ఎదురెళ్లి జనం, ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికారు. హారతులిచ్చి, తిలకం దిద్ది ఆహ్వానించారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మెప్మా సిబ్బంది, యుటిఎఫ్ ఉపాధ్యాయులు, చింతలపూడి ఎత్తిపోతల పథకంలో బాధిత రైతులతోపాటు అనేక మంది తమ సమస్యలపై యాత్ర బృందానికి వినతులు అందించారు. చింతలపూడి నుంచి అమరావతికి బస్సు సౌకర్యం లేదంటూ సైతం వినతిపత్రం అందించారు. యాత్రలో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, ఏలూరుల్లో బహిరంగ సభలు జరిగాయి. ఈ సందర్భంగా బృంద నాయకుడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. అసమానతలు లేని సమాజం కోసం సిపిఎం పోరాడుతుందన్నారు. 2008లో ప్రారంభమైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఇప్పటికీ పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. టి.నర్సాపురంలో సాహసోపేతమైన భూపోరాటం సాగిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఎర్రకాలువ మిగులు భూములకు సంబంధించి పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెలకు రూ.25 వేల కోట్లు జిఎస్‌టి రూపంలో వస్తున్నాయన్నారు. జగన్‌కు రూ.50 వేల కోట్లు ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని, వాటిని పేదలకు పంపిణీ చేయాలన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిస్తే పెద్దలకే ప్రయోజనమన్నారు. ప్రతి పేద కుటుంబానికి రెండెకరాల భూమి, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎలుగా గెలిచిన వారు మంత్రులుగా పని చేశారని, ఇక్కడ ఒక్క బస్సు డిపో ఏర్పాటు చేయకపోవడం అత్యంత ఘోరమని అన్నారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆందోళనలు చేస్తే బెదిరింపులు, వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. పంట దెబ్బతిన్న రైతులకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం సభల్లో మాట్లాడుతూ ఎర్రకాలువ ప్రాజెక్టు కింద 2,500 ఎకరాలు ఉందన్నారు. ఈ భూములకు భూస్వాములు డబ్బులు తీసుకున్నారని, అయినప్పటికీ ఆ భూములు మళ్లీ వారికే ఇవ్వాలని చూస్తున్నారన్నారు. ఉద్యమకారులపై బైండోవర్ కేసులు పెట్టి బెదిరిస్తున్నారన్నారు. తహశీల్దార్ బడాబాబుల పక్కన ఉంటున్నారని, పేదలంతా కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. పేదల పక్షాన టిడిపి, జనసేన ఎవరైనా అండగా ఉన్నారా అని ప్రశ్నించారు. బటన్ నొక్కితే అభివృద్ధి కాదని, రెండెకరాల భూమి ఇస్తే అభివృద్ధి అని అన్నారు. 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ మాట్లాడారు. కొయ్యలగూడెంలో సభకు మండల కార్యదర్శి ఎన్.రాంబాబు, జంగారెడ్డిగూడెం సభకు మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం, టి.నరసాపురం సభకు పి.వి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. చింతలపూడిలో మండల కార్యదర్శి ఆర్‌వి.నారాయణ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. లింగపాలెంలో యాత్ర బృందానికి స్వాగతం పలుకుతూ పలువురు విజయరాయిలో కొబ్బరి రైతులు తమ సమస్యలను యాత్ర బృందానికి వివరించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అశోక్, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో వినతి అందిస్తున్న అంగన్వాడీలు


చింతలపూడిలో యాత్ర బృందానికి స్వాగతం


టి.నర్సాపురంలో వినతి అందిస్తున్న మహిళలు



జంగారెడ్డిగూడెంలో యాత్ర బృందంతో నేతల ర్యాలీ

ఏలూరులో ఘనస్వాగతం

బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం ఏలూరు చేరుకుంది. కండ్రికగూడెం పంచాయతీ ఆఫీసు వద్ద నుంచి అశోక్‌నగర్ వంతెన, పత్తేబాద్, విజయ విహార్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్‌పేట పార్కు వద్ద సభా స్థలికి యాత్ర చేరుకుంది. అక్కడ సభకు సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సినిమాల్లో హీరో అయిన పవన్ కళ్యాణ్ దేశానికి విలన్ అయిన మోడీని వెనకేసుకురావడంలో ఆంతర్యం ఏమిటో కనీసం ఆయన పార్టీ కార్యకర్తలకు చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, కమ్యూనిస్టులను చట్టసభలకు పంపాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎంకు అవకాశం ఇస్తే ఒక రూపాయికి యూనిట్ విద్యుత్ ఇస్తామన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పాఠశాల ఏర్పాటు చేయండి

బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలపై సమీక్షించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రజాశక్తి - ఏలూరు

తాడువాయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అంగన్వాడీ కేంద్రం, స్కూలు, విడబ్ల్యుఎస్ తదితర ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి వివిధ అంశాలపై పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఇతర సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించి వాటి తక్షణ పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ సహాయ పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్) కింద నిర్వాసితులకు పెండింగ్ బిల్లుల అప్ లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు తహశీల్దార్లు సంబంధిత సమాచారాన్ని ఐటిడిఎ పిఒ కార్యాలయం నుండి శనివారంలోపు పొంది వాటిని అప్‌లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆప్షన్-2, 3 కింద ఉన్న బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అదేవిధంగా 45.16 కాంటూరుకు సంబంధించి 15 గ్రామాలకుగాను ఇంకా మిగిలిన రెండు గ్రామాల్లో ఎన్యుమరేషన్‌ను శుక్రవారం నాటికి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషేను కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో భూమి, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి అందిన సమస్యలపై కేసులవారీ నివేదిక అందించాలని ఐటిడిఎ పిఒను కలెక్టర్ ఆదేశించారు. పరిహారం చెల్లింపులో భాగంగా 948 మంది నిర్వాసితులకు చెందిన పాన్ కార్డుల కోసం సంబంధిత ఎంపిడిఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శుక్రవారం నాటికి వారితో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కోయ రాజమండ్రి భూపరిష్కారానికి సరిహద్దులు గుర్తించి స్టోన్ ప్లాంటేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చింతలపూడి ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటి వరకూ పూర్తి చేసిన పనులు, ఇంకా మిగిలిన పనులు, భూసేకరణ, నిధులు తదితర అంశాలకు సంబంధించి సమగ్ర నివేదిక అందించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సరిపల్లి కాలనీలో పాఠశాల భవన నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి తాడువాయి రైతుల భూమి పరిహారం, కోర్టు కేసులకు సంబంధించి తదితర అంశాలపై సంబంధించిన రైతులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంప్రదింపులు చేశారు. సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళావందన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గీతాంజలి, ఝాన్సీరాణి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, ఉంగుటూరు, దెందులూరు, బాపులపాడు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కంటి శుక్లాల ఆపరేషన్లకు పటిష్ట కార్యాచరణ

జిల్లాలో 2,746 మందికి శుక్లాల ఆపరేషన్లు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన కంటి ఆపరేషన్ల నిర్వహణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో కంటిశుక్లాల ఆపరేషన్ల నిర్వహణపై వైద్యాధికారులు, ప్రభుత్వ, ప్రయివేటు కంటివైద్యులతో ఆయన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి చేయడానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు పూర్తిగా సహకరించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 2,746 మందికి కంటిశుక్లాల ఆపరేషన్లను సకాలంలో నిర్వహించడానికి డిఎంహెచ్ఒ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో పాల్గొన్న వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలకు కంటి ఆపరేషన్ల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. ఆపరేషన్లు చేయించుకునే వారిని వారి ప్రాంతం నుండి సంబంధిత ఆసుపత్రికి తీసుకువచ్చి తిరిగి ఆపరేషన్ అనంతరం వారి ఇంటివద్ద విడిచిపెట్టేందుకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. కంటి ఆపరేషన్లు నిర్దేశించిన ప్రతి ఆసుపత్రికి ఒక ఇన్‌ఛార్జిని నియమించాలన్నారు. ఆసుపత్రి వద్ద రోగికి ఆపరేషన్ చేయించేందుకు ఆసుపత్రి శ్రేణులకు ఎఎన్ఎం సహకారం అందజేయాలన్నారు. ఆపరేషన్‌కు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడంతోపాటు ఏ తేదీన ఎక్కడ ఆపరేషన్ నిర్వహిస్తారో సంబంధిత మెడికల్ ఆఫీసరు ముందుగా తెలియజేయాలన్నారు. ఆశ్రమం మెడికల్ కాలేజీలో ప్రతిరోజూ 20 మందికి, శంకర నేత్రాలయలో రోజుకు 10 మందికి, ఏలూరు విజయ నేత్ర ఆసుపత్రిలో రోజుకు 15 మందికి, జంగారెడ్డిగూడెం రామచంద్ర శంకర నేత్ర చికిత్సలయలో రోజుకు 10 మందికి, ఏలూరు, విజయ కంటి ఆసుపత్రిలో రోజుకు 10 మందికి, నూజివీడు జిఎంహెచ్ ఆసుపత్రిలో రోజుకు 20 మందికి, జంగారెడ్డిగూడెం విజయ ఐ కేర్ ఆసుపత్రిలో రోజుకు 10 మందికి, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 10 మందికి, నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రోజుకు 8 మందికి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో రోజుకు 8 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పాల్ సతీష్, ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగం ప్రధాన అధిపతి డాక్టర్ మల్లికార్జునరావు, పలు ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మ గౌరవం ఢిల్లీలో తాకట్టు

- వైసిపి, టిడిపి, జనసేన విధానాలపై గళమెత్తిన ప్రజారక్షణ బేరి
- రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం
- నరసాపురం సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం


నరసాపురం సభలో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం/యలమంచిలి/నరసాపురం

తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని వైసిపి, టిడిపి, జనసేన ఢిల్లీలో తాకట్టు పెట్టడం సిగ్గుచేటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం విమర్శించారు. సిపిఎం చేపట్టిన 'ప్రజారక్షణ భేరి' బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి చించినాడ బ్రిడ్జి మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. చించినాడ, నరసాపురంలో సభలు నిర్వహించారు. నరసాపురంలో సభకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రాంతాలు, రాష్ట్రాల మధ్య వ్యత్యాసం పెరుగుతుందని, ఈ నేపథ్యంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా ప్రణాళిక రూపొందించిందన్నారు. విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు నిధులు, వెనుకపడిన ప్రాంతాల అభివృద్ధి, రాజధాని నిర్మాణం నిధులు కేటాయించలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బిజెపి పాలనలో ధరలు పెరిగాయని , ఉద్యోగావకాశాలు లేవని, ఆత్మహత్యలు పెరిగాయని , గిట్టుబాటు ధర అందట్లేదని అన్నారు. రాష్ట్ర హక్కులను హరిస్తున్నా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడకపోవడం దారుణమన్నారు. బటన్ నొక్కడం తప్ప అభివద్ధికి చర్యలు తీసుకోకుండా జగన్ ఓట్ల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నరసాపురం ఎంపీ ఈ నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్లో ఒక్కరోజూ ప్రస్తావించలేదని విమర్శించారు. విభజన హామీలు అమలు చేసినప్పుడే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి చెప్పారు. రాష్ట్రంలో మూడున్నర లక్షల స్కీం వర్కర్లుగా పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనం లేదన్నారు. నర్సాపురంలో అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయని, అభివద్ధి మాత్రం శూన్యమని సిపిఎం రాష్ట్ర నాయకులు వై.రాము విమర్శించారు. వశిష్ట వారధి ఎన్నికల హామీగానే వస్తుందే తప్ప నిర్మాణం మాత్రం చేయలేదన్నారు. ఫిషింగ్ హార్బర్ లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం చెప్పారు. రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవిష్యత్తులో రైతుల పక్షాన నిరంతర పోరాడతామన్నారు. కూలీలకు కనీస వేతనం అందట్లేదని, వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో వేల మంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, అయితే వేట నిషేధ సమయంలో కొంతమందికి మాత్రమే పరిహారం అందిస్తున్నారన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ హామీని అమలు చేయకుండా విస్మరించారని విమర్శించారు. జిల్లాను కాలుష్యం పట్టిపీడిస్తుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా విజయవాడలో ఈ నెల 15న నిర్వహించబోయే బహిరంగ సభకు రావాలని కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర నేత కొల్లాటి శ్రీనివాస్, నేతలు దిగుపాటి రాజగోపాల్, ఎం.త్రిమూర్తులు, పొన్నాడ రాము, జల్లి రామ్మోహన్, యడ్ల చిట్టిబాబు, పొగాకు పూర్ణ, నారాయణరావు, తెలగంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలు ఖరారు

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్ఎంఆర్ కార్మికులకు 2023-24 సంవత్సరానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జిలా కమిటీ వేతనాలు ఖరారు చేసింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులకు వేతనాలు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్డ్ కార్మికునికి రోజుకు రూ.630 నుండి రూ.675, సెమీ స్కిల్డ్ కార్మికునికి రూ.565 నుండి రూ.605, అన్ స్కిల్డ్ కార్మికునికి రూ.525 నుండి రూ.562గా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వేతనాలు 2023 ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు.


విద్యార్థుల బస్సులో తనిఖీలు చేస్తున్న డిటిసి శాంతకుమారి

విద్యాసంస్థల బస్సుల తనిఖీ

17 బస్సుల నిర్వాహకులపై కేసులు - డిటిసి శాంతకుమారి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బస్సుల తనిఖీలు ముమ్మరం చేశామని జిల్లా ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి తెలిపారు. సోమవారం సాయంత్రం కళాశాల విద్యార్థులతో ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురి కావడంతో మంగళవారం సాయంత్రం కళాశాలు వదిలే సమయానికి నగరంలోని ఫైర్‌స్టేషన్ వద్ద కమిషనర్ శాంతకుమారి స్వయంగా విద్యాసంస్థల బస్సుల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 17 బస్సుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇద్దరు డ్రైవర్లకు లైసెన్సులు లేనట్లు గుర్తించారు. పరిమితికి మించి విద్యార్థులను రవాణా చేస్తున్న నాలుగు బస్సులు, ఎమర్జెన్సీ డోర్లు లేని ఆరు బస్సులు, ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకుండా నడుపుతున్న ఐదు బస్సుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా కమిషనర్ పరిధిలో కూడా దాడులు నిర్వహించినట్లు డిటిసి శాంతకుమారి తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు సిపిఎం నిరసన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులె వెంటనే ఆపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం స్థానిక చినగాంధీబొమ్మ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ప్రపంచశాంతి వర్ధిల్లాలన్నారు. తక్షణం అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న దాడులను తక్షణం ఆపాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్.హనుమాన్లు, దుర్గారావు, శోభనాద్రి, మరియదాసు పాల్గొన్నారు.

యూరియా 20 బస్తాల కంటే ఎక్కువ అమ్మితే చర్యలు

డీలర్లకు జెసి బి.లావణ్యవేణి హెచ్చరిక


మాట్లాడుతున్న జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై యూరియాను అందజేస్తుందని, దీనిని అక్రమ మార్గంలో అమ్మిన వారితోపాటు కొనుగోలుదారులపైనా చర్యలు చేపడతామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో టాప్-20 యూరియా కొనుగోలుదారులు, డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులతో జిల్లాస్థాయి టాప్-20 యూరియా విచారణ సమావేశం జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధ్యక్షతన జరిగింది. జెసి మాట్లాడుతూ జిల్లాలోని ఎరువుల దుకాణదారులు యూరియా బస్తాలు ఒక్కరికే 40 బస్తాలు విక్రయించడం టాప్-20లో ఉన్న జిల్లాలో 54 మందిని గుర్తించామని, వీరికి జరిమానాగానీ, డీలరు లైసెన్స్‌ను రద్దుగానీ చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క పేరు మీద యూరియా 20 బస్తాలకు మించి విక్రయించకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తూ.చ తప్పకుండా డీలర్లు పాటించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని టాప్-20లో ఉన్న డీలర్లు, కొనుగోలుదారుల నివేదికను డివిజన్లవారీగా జెసి సమీక్షించారు. సమావేశంలో వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ, ఎడిఎలు, ఎఒలు, ఆర్‌బికె అసిస్టెంట్లు, డీలర్లు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు సరికాదని, ఐక్యరాజ్యసమితిలో పాల్గొన్న అనేక దేశాలు పాలస్తీనాకు మద్దతు తెలిపి, దాడులు ఆపాలని తీర్మానం చేశాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా నాయకులు డి.రంగారావ్, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జానీ, మండల కమిటీ సభ్యులు జంగా రామచంద్రారెడ్డి, దండా కృష్ణ, బోడ వజ్రం, గంధం అంజయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపల్లి శ్రీనివాసరావు, ఎస్‌కె.మస్తాన్, ఎస్‌కె.కాలేషా, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

9 నుంచి 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి - చాట్రాయి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'పల్లెకు పోదాం' కార్యక్రమం ఈనెల 9 నుంచి ప్రారంభమవుతుందని మండల అభివృద్ధి అధికారి కె.దుర్గాప్రసాద్ తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలలో చేసిన అభివృద్ధి గురించి తెలియజేయడం, ప్రజా అభిప్రాయాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. 9వ తేదీన చనుబండ-2, సచివాలయం, 10న చనుబండ-1, 14న బూరుగు గూడెం, 15న చిన్నంపేట, 16న చిత్తపూరు-1, 17న చిత్తపూరు-2, 20న జనార్దనవరం, 21న కోటపాడు, 22న కొత్తగూడెం, 23న మర్లపాలెం గ్రామాలలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

మాజీ మంత్రి సుజాతపై కేసులు ఎత్తివేయాలి

టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర

చింతలపూడి : మాజీ మంత్రి పీతల సుజాతపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారా వీరేంద్ర తెలిపారు. పట్టణంలోని బట్టువారి గూడెం గ్రామంలో టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు బండారు ఆశీర్వాదం అధ్యక్షతన టిడిపి నాయకులపై బనాయించిన అక్రమ కేసులపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేంద్ర మాట్లాడుతూ టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ భయపెడుతున్నారని కేసులు పెడుతున్నారన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఒక్క కేసు కూడా నిరూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గడిదేసి యేసు, మానేపల్లి రాజారావు, మహాలక్ష్మయ్య, వైవి.సత్యనారాయణ, చక్రపు మారేసు, మాజీ ఎంపిటిసి మంగళగిరి సుందరయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తొమ్మిది గ్రామాలలో రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వ్యవసాయ అధికారి చాముండేశ్వరి మంగళవారం తెలిపారు. జంగంగూడెం, రావిచర్ల, అన్నవరం, సుంకొల్లు, పల్లెర్లమూడి, తుక్కులూరు, పోతురెడ్డిపల్లి, దిగవల్లి గ్రామాలలో ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ధాన్యం రవాణా, కూలీ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, రైతులు పూర్తి వివరాలకు సమీపంలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని చాముండేశ్వరి తెలిపారు.

'ప్రజా రక్షణ భేరి' యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ



ఆగిరిపల్లిలో సంఘీభావ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రజా రక్షణ భేరి' బస్సు యాత్రకు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిధిలోని అడవినెక్కలం నుంచి ఏలూరు వరకు సంఘీభావ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిపిఎం నాయకులు జి.రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చాకిరి శివనాగరాజు, సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, రాజులపాటి చంటి, అయ్యప్ప, సామియేలు, రవీంద్ర, చిన్నారావు, నవీన్‌కుమార్, సుందరం, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

నిడమర్రు : ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు తెలిపారు. మంగళవారం నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీల్లో నిడమర్రులో ప్రజా రక్షణ భేరి జీపు ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిడమర్రులో ఇంటింటికీ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, కమలి నాని పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని పల్లెర్లమూడి గ్రామంలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి యాత్రకు సంఘీభావంగా బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 15వ తేదీన విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ హనుమాన్లు, దుర్గారావు, శోభనాద్రి, మరియదాసు, నూజివీడు మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్రం విడగొట్టి పదేళ్లు పూర్తి కావస్తున్నా రాష్ట్రం అగమ్య గోచరంగా వుందని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు, జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చింతలపల్లి, కొర్లకుంట, ముసునూరు, గోపవరం, కాటన్ పాడు, వేల్పుచర్ల గ్రామాల మీదగా ప్రజారక్షణ భేరి కార్యక్రమంలో భాగంగా బైకు ర్యాలీ నిర్వహించారు. అలాగే ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపారావు, కె.దుర్గారావు, కె.శ్రీను, సిహెచ్.శ్రీను, కంచర్ల రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.



వికలాంగుల హక్కులపై విద్యార్థులకు అవగాహన

వికలాంగులు ప్రత్యేక హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారపాటి ప్రకాశ్ రావు తెలిపారు. దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు శనివారపు పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2016 వికలాంగుల హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం నిర్వహించు కార్యక్రమాల గురించి, ఈ కేంద్రం అందించే సేవలైన కృత్రిమ అవయవాలు అమర్చడం, ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ గురించి వివరించారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఫిజియో థెరపిస్ట్ జి.రాంబాబు మాట్లాడుతూ వికలాంగులను అవహేళన చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇతర వివరాలకు 08812 - 249297, 7386565469లను వికలాంగులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పుండరీబాబు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా వై.పుండరీబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం నుంచి ఆయన ఆగిరిపల్లికి బదిలీపై వచ్చారు.

గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా..

లింగాల సర్పంచి ధనలక్ష్మి రాధిక



డ్రెయినేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచి రాధిక

ప్రజాశక్తి - మండవల్లి

పారిశుధ్యరహిత గ్రామంగా తీర్చిదిద్ది, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని లింగాల సర్పంచి బోయిడి ధనలక్ష్మి రాధిక స్పష్టం చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న డ్రెయినేజీ పనులను ఆమె అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ క్రమంలోనే గ్రామంలో పక్కా డ్రెయినేజీ నిర్మించేందుకు చర్యలు చేపట్టి పనులు నిర్వహిస్తున్నామన్నారు. లింగాల గ్రామ పరిధిలో సుమారు రూ.40 లక్షలు వెచ్చించి, సుమారు 700 మీటర్ల డ్రెయినేజీని నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్లు నిర్మించుకోవడం జరిగిందన్నారు. రాజకీయాలకు తావు లేకుండా కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుని, పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. నాపై నమ్మకం ఉంచి సర్పంచిగా గెలిపించిన ప్రజల నమ్మకానికి కట్టుబడి ఉంటానన్నారు. గ్రామస్తుల ఆదరాభిమానాలతో, అండదండలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఎన్ వివిఎస్.శాస్త్రి, ఎఇ వివి.కృష్ణారావు, బోయిడి సురేష్, కార్యదర్శి కొండలు పాల్గొన్నారు.

కొల్లేరుపై 14 నుంచి ప్రజా అవగాహన

ఏలూరు టౌన్ : కొల్లేరు అభయారణ్యం చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంతం ఏర్పాట్లపై ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రజా అవగాహన కార్యక్రమాలు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఏలూరు వన్యప్రాణి యాజమాన్య విభాగము డివిజనల్ అటవీ శాఖ అధికారి ఎస్.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సున్నిత పర్యావరణ ప్రాంత ఏర్పాట్లపై ప్రజా అవగాహన కార్యక్రమాలు కాంటూరు పరిధి గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. కొల్లేరు అభయారణ్యము పరిధిలోని ఏలూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు, కైకలూరు, మండవల్లి, ఆకివీడు మండలాల్లో వివిధ దైనందిన కార్యక్రమాలు నిర్వహించే ప్రజలకు సంబంధిత తహశీల్దార్ వారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ హాజరై ఈ అవగాహన సదస్సును వినియోగించుకోవాలని ఎస్.రవిశంకర్ తెలియజేశారు.

ఆర్ఎంపిలపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామీణ ప్రాంతాలలో వైద్యం అందిస్తున్న ఆర్ఎంపిలపై దౌర్జన్యానికి దిగి దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కైకలూరు నియోజకవర్గ ఆర్ఎంపి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు ఎం.విజయబాబు కోరారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం కంచర్ల వారి పల్లె గ్రామంలో ఆర్ఎంపి వైద్యుడు అజయ్‌కుమార్ క్లినిక్‌పై కొంతమంది దుండగులు దాడి చేసి, ఫర్నిచర్‌ను దగ్ధం చేయడంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా లోకుముడి గరువులో మంగళవారం నిర్వహించిన ఆర్ఎంపిడబ్ల్యుఎ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజయ్ కుమార్ క్లినిక్‌ను ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఈ దాడి ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఏరియా ఆర్ఎంపి వైద్యుల గౌరవ అధ్యక్షులు శేషుబాబు, సెక్రెటరీ లంకపల్లి రవి, కోశాధికారి జి.జనార్ధన్ రావు, లాయరు బి.బాల రామ్మూర్తి, బి.రమేష్ పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతో శివపురం రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - చింతలపూడి

ఎంపీ కోటగిరి శ్రీధర్ సహకారంతో 25 సంవత్సరాలుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న శివపురం రోడ్డుకి మోక్షం లభించిందని చింతలపూడి జెడ్‌పిటిసి మోలుగుమాటీ నిరజాసుధాకర్ తెలిపారు. మండలంలోని శివపురం గ్రామంలో రూ.1.5 కోట్లు శివపురం, రూ.1.5 కోట్లు శివపురం-మల్లేశ్వరం, రూ.1.5 కోట్లు నిధులతో మంజూరైన మల్లేశ్వరం-యండపల్లి రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. అదేవిధంగా ఎంపిపి నిధులు రూ.15 లక్షలతో కల్వర్ట్ నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రోడ్డు లేక శివపురం, యండపల్లి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎంపీ ఈ రోడ్డుపై దృష్టి పెట్టారని, త్వరలో బోయగూడెం-నామవరం రోడ్డు కూడా వేస్తారన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన సాగిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ లబ్ధిపొందే విధంగా నవరత్నాలు ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీల్లో 90 శాతం పనులు పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు.

పంచాయతీని పోలీస్ స్టేషన్‌కు కేటాయించడం తగదు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి పంచాయతీ కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్ నిర్వహణకు కేటాయిస్తూ పంచాయతీ హడావిడిగా నిర్ణయం తీసుకోవడం సరైనది కాదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్పందనలో కార్యదర్శి తోట శ్రీనివాసరావుకు వినతిని ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ గ్రామం మధ్యలో 27 ఏళ్ల క్రిందట గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. పంచాయతీ భవనాన్ని ఖాళీ చేసి ఐదు నెలలపాటు పోలీస్ స్టేషన్‌కు ఇచ్చి, పంచాయతీ కార్యాలయాన్ని గ్రామానికి దూరంగా ఉన్న సచివాలయంలో కొనసాగించేందుకు హడావిడిగా తీర్మానించడం సరైనది కాదన్నారు. పంచాయతీ కార్యాలయం ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని తెలిపారు. పాలకవర్గం మరోసారి పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని, గ్రామసభలో గ్రామస్తుల నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు టి.అప్పారావు, పొన్నూరు రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎఫ్‌పిఒల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మేలు

జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : జిల్లాలో ఎఫ్‌పిఒల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లాలో ఎఫ్‌పిఒల ఏర్పాటు, ప్రోత్సాహం కోసం నిర్వహించిన జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పిఒల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం, మార్కెట్లను నిర్ధారించడం, వ్యయ ప్రభావవంతమైన పద్ధతిలో వ్యవసాయ ఇన్‌పుట్లను సరఫరా చేయడం వంటి వివిధ మార్గాల్లో రైతులకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. వ్యవసాయ ఆధారితమైన ఏలూరు జిల్లాలో కూరగాయల సాగు, ఉద్యాన పంటల కింద మరిన్ని ఎఫ్‌పిఒలను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. తదుపరి సమావేశం నాటికి కూరగాయల రైతు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉద్యానవన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఎఫ్‌పిఒలకు సేకరణ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, గోడౌన్లు మొదలైన వాటికి 75 శాతం వరకు సబ్సిడీ పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. డిడిఎం నాబార్డ్ అనిల్ కాంత్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ద్వారా 10 వేల ఎఫ్‌పిఒల ఏర్పాటుకు ప్రణాళిక చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో 18 ఏర్పాటయ్యాయన్నారు. అలాగే జిల్లాలో నాబార్డ్ ఆధ్వర్యంలో ఇప్పటికే 16 ఎఫ్‌పిఒలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా రైతులకి ఎంతో మేలు జరిగిందని తెలిపారు. నాబార్డ్ పథకాల ద్వారా ఎన్నో ప్రయోజనాలు రైతులకి చేకూరాయని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం నీలాద్రి, డిడిఎం - నాబార్డ్ అనిల్ కాంత్, ఉద్యానవన అధికారి, ఎస్.రామ్ మోహన్, పశుసంవర్ధక శాఖ అధికారి జి.నెహ్రూ బాబు, మత్స్య శాఖ, మార్కెటింగ్ శాఖ హాజరయ్యారు.

దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

230 మంది విద్యార్థులకు బస్సుపాస్‌ల పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దాతలు అందించిన సహాయాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ఆగిరిపల్లి జెడ్‌పిహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత తెలిపారు. ఆగిరిపల్లి జెడ్‌పిహెచ్ పాఠశాలకు దూరప్రాంతాల నుంచి వచ్చే 230 మంది విద్యార్థులకు స్థానిక ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు వితరణగా అందజేసిన బస్సు పాస్‌లను వైసిపి జిల్లా కార్యదర్శి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మచ్చా హరిబాబు, టిజెఎస్ కుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పి.నరశింహారావు, జెడ్‌పిటిసి పి.వీరబాబు, నాయకులు నాగుల్ మీరా, ఇస్సాక్, శ్రీమన్నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.



చాట్రాయిలో సస్యరక్షణపై రైతులకు అవగాహన

మిర్చి తోటల్లో సస్యరక్షణ చేపట్టాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మిర్చి తోటలలో సమగ్ర సస్యరక్షణ చేపట్టాలని, తెల్లదోమ, తామర పురుగు నివారణకు పసుపు, నీలిరంగు జిగురు అట్టలను తోటలలో ఏర్పాటు చేసుకోవాలని ఉద్యానశాఖ మండల అధికారిని ఆర్.హేమ తెలిపారు. మండలంలోని చాట్రాయి, నరసింహారావు పాలెం గ్రామాలలో మంగళవారం ఉద్యానశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా హేమ రైతులతో మాట్లాడుతూ తామర పురుగు, పెనుబంక ఉన్నట్లయితే ఇమిడా క్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్‌కు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఊతపురుగు కనిపిస్తున్నందున వేప నూనె వెయ్యి మిల్లీ లీటర్లకు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. రసాయన వాడకం తగిన మోతాదులో వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : మిర్చి తోటలో వచ్చిన తెగుళ్ల నివారించడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారి కె.జ్యోతి ప్రియాంక రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వలసపల్లి గ్రామంలో మిర్చి తోటలను రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బొబ్బర తెగులు నివారణకై ఎకరానికి అఫ్ లీటర్ ఇమిడి క్లోరోఫాయిడ్ పిచికారీ చెయ్యాలని తెలిపారు. నారు పోసే సమయంలో మంచి రకం నారుని ఎన్నుకోవాలని సూచించారు.

రొయ్యలకు కనీస ధర అమలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రొయ్యలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస ధరలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు కనీస ధరలు రాక, పెట్టిన పెట్టుబడి కోల్పోయి రొయ్యల రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారన్నారు. అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సాగు సంక్షోభంలో ఉందని, తమను ఆదుకోవాలంటూ ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస ధరలు ప్రకటించినా ఆచరణలో ఆ ధరలు అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస ధరలు రొయ్యలు 30 కౌంట్‌కు రూ.500, 40 కౌంట్‌కు రూ.420, 50 కౌంట్‌కు రూ.360, 60 కౌంట్‌కు రూ.320, 70 కౌంట్‌కు రూ.290, 80 కౌంట్‌కు 270, 90 కౌంట్‌కు రూ.250, 100 కౌంట్‌కు రూ.240 ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. ఎగుమతి దారులు, దళారులు సిండికేట్‌గా మారి తక్కువకు కొనుగోలు చేసి, రొయ్యల రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. భారీగా పెంచేసిన సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని, రొయ్యలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస ధరలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రొయ్యల రైతులను ఆదుకోవాలని కోరారు.

అక్టోబర్ విప్లవ స్ఫూర్తిని కొనసాగించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్



సోషలిస్టు విప్లవ దినోత్సవ సభ నిర్వహిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అక్టోబర్ సోషలిస్టు విప్లవ స్ఫూర్తిని కొనసాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో ఆర్ఆర్ పేట, స్ఫూర్తి భవన్‌లో అక్టోబరు సోషలిస్టు విప్లవ దినోత్సవ సభ ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా విప్లవాలకు, పోరాటాలకు దిక్సూచిలా కార్మికుల, కర్షకుల ఆధ్వర్యంలో ప్రభుత్వాలు ఏర్పాటు చేయవచ్చనే మహత్తర సందేశాన్ని అక్టోబర్ సోషలిస్టు ఉద్యమం లెనిన్ నాయకత్వాన చాటి చెప్పిందన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై నాటి అక్టోబర్ సోషలిస్టు విప్లవ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఏలూరు ఏరియా కార్యదర్శి హేమ శంకర్ మాట్లాడుతూ మహత్తర సోషలిస్టు విప్లవం రష్యాలో విజయవంతం కావడంతో ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక ఉద్యమాలకు ఒక నూతన స్ఫూర్తిని, ఉత్తేజాన్ని ఇచ్చిందని, ఆ విప్లవం విజయవంతమై 105 సంవత్సరాలు పూరైన సందర్భంగా నాయకులు, పార్టీ సభ్యులు ఆ విప్లవ స్ఫూర్తితో ఉద్యమించాలని, ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, ఎంఎ.హకీమ్, పొట్టేలు పెంటయ్య, గోర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మీ, భవాని, జోజీ మేరీ, ప్రభావతి, స్వప్న, రషీద్, శాయన అభిలాష్ కుమార్, యర్రా వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రమాదవశాత్తు రైలు బండికి ప్లాట్ ఫామ్‌కు మధ్య పడిన వృద్ధుడు మృతి చెందిన ఘటన ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణానికి చెందిన వంగపండు సత్యం నాయుడు(67) బొబ్బిలి నుంచి ఏలూరు రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి వచ్చాడు. ఈ రైలు మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఏలూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుని తిరిగి బయలుదేరుతున్న సమయంలో ఆయన నిద్రమత్తులో రైలు బండి దిగేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తుంది. ఈ సమయంలో ఆయన ప్రమాదవశాత్తు రైలు బండికి రైల్వే ప్లాట్ ఫామ్‌కి మధ్యలో పడిపోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు అతన్ని బయటికి తీసే సమయంలోనే ఆయన మృతి చెందాడు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించి, మంగళవారం రాత్రి బంధువులకు అప్పగించారు.

తెలంగాణా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు తెలిపారు. వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం జీలుగుమిల్లి మండలంలోని తాటియాకులగూడెం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి కంభంపాటి లక్ష్మణరావు తన వద్ద ఉన్న సంచిలో 10 మద్యం బాటిళ్లను పెట్టుకొని లక్ష్మీపురం గ్రామానికి వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.